క్లుప్తంగా

కూలిన కల్వర్టుతో ఇక్కట్లు



డెనిజోలా వద్ద కూలిపోయిన కల్వర్టు

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ కేంద్రం నుంచి లబ్బూరు వెళ్లే మార్గంలో డైనిజోలా వద్ద కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో డైనిజోలా వద్ద ఈ కల్వర్టు కూలిపోయింది. పంచాయతీరాజ్ అధికారులు మట్టి వేసి రాకపోకలు జరిగే విధంగా మార్గం సుగుమం చేశారు. అయితే ప్రసుత్తం మట్టి కోట్టుకుపోయి, గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఈ కారణంగా బరడ, లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని స్థానికులతో పాటు బరడ పంచాయతీ సర్పంచ్ సీసా పార్వతి, ఎంపీటీసీ సభ్యులు కోడా నబ్బో కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ జేఈ మురళీకృష్ణ మాట్లాడుతూ డైనిజోలా వద్ద కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

2న 'ఉపాధి' ఇంటర్వ్యూలు

కొయ్యూరు: వంద రోజుల ఉపాధి పనులు పూర్తి చేసిన వేతనదారుల కుటుంబాల పిల్లలకు ఉపాధి అవకాశాలపై ఏప్రిల్ 2న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఏపీవో అప్పలరాజు ఆదివారం తెలిపారు. వంద రోజుల పనిదినాలను పూర్తి చేసిన వారి పిల్లల్లో అర్హులు ఉంటే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

పూడికతీత పనులకు భూమిపూజ



పనులకు భూమి పూజచేస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువ పూడికతీత పనులకు రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగునీటి చెరువుల అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరామని, ఈ ఏడాది చెరువులు, పంట కాలువలకు మరమ్మతు పనులు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం దూసరపాము గ్రామంలో పీఎం శ్రీ పాఠశాలలో అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. పెద్దిరాజు, కేశవరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెన్నడో?



కమలబంధ- సాగిరివలసలో రహదారి దుస్థితి



కుంబిడికుంటి మట్టి రోడ్డు

- అధ్వాన దారులతో అవస్థలు
- చినుకు పడితే చిత్తడే
- కానరాని రవాణా సదుపాయం
- రాకపోకలకు ఇక్కట్లు



అటవీ అధికారుల అనుమతి ఇవ్వకపోవడంతో నిలిచిపోయిన గరిడేలు- కుసుమకేద రహదారి



రాళ్లుతేలిన పెద్దపాడు రోడ్డు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కమలబంధ, సాగిరివలస రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తుంది. పెద్ద పెద్ద గోతులతో రాళ్లు తేలిన ఈ రహదారిపై ప్రయాణానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. కమలబంధ– సాగిరివలస రహదారి నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. రహదారి పూర్తి చేయాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. అధ్వాన రహదారి వల్ల అత్యవసర సేవలకు అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదని ఆదేవన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైతులు సేకరించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను సమీప ప్రాంత సంతలకు తరలించేందుకు రవాణా సదుపాయం లేదనంటున్నారు. దీంతో ఎక్కడి వెళ్లాలన్నా కాలినడక శరణ్యమైందని వాపోతున్నారు.

కోతకు గురైన రహదారి

రోడ్డు సమస్యతో పాటు ఆయా గ్రామాల్లో డ్రైనేజీ సమస్య వెంటాడుతుంది. భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పెద్దపాడు రహదారి. మండల కేంద్రం నుంచి చాపరాయి మీదుగా పెద్దపాడు, తెంగడవలస, దిబ్బగుడ, వత్ర, సిరాగం మీదుగా అరకులోయ మండలానికి వెళ్లే రహదారి కోతకు గురైంది.ఈ రహదారి నుంచి మాడగడ మేఘాలకొండతో పాటు సుంకరమెట్ట వ్యూపాయింట్‌కు చేరవచ్చు. సీజన్‌లో అనేక వందలాది పర్యాటకులు వాహనాల్లో ఇక్కడికి వస్తుంటారు. ఈ రహదారి కోతకు గురవడంతో గిరిజనులు పండించిన వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను వారపు సంతలకు తరలించడంలో కష్టమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. కొల్లాపుట్టు పంచాయతీ కుమిడికుంటి రోడ్డు అసంపూర్తిగా వదిలేశారని చెబుతున్నారు. గసభ పంచాయతీలో కుసుమకేంద, గరిడేలి గ్రామంలో రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో రహదారి పనులు నిలిచిపోయినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ తదితర పనులకు ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు.

రహదారి నిర్మించాలి



మా గ్రామం మీదుగా అరకులోయ, అనంతగిరి మండలాలకు కలిపే ఈ రోడ్డు నిర్మించాలి. తక్షణమే అధికారులు స్పందించాలి. సీజన్‌లో ఈ రహదారిలో అనేకమంది పర్యాటకులతో పాటు మూడు మండలాల గిరిజను రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– కొర్ర శరభయ్యా, గ్రామస్తుడు, పెద్దపాడు గ్రామం, పోతంగి పంచాయతీ

తక్షణమే రోడ్డు పనులు పూర్తిచేయాలి



కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలి. గ్రామానికి అంబులెన్స్ వచ్చే వీలు లేకుండా ఉంది. వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను సంతల్లో తరలించేందుకు రవాణా సదుపాయం లేదు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లేందుకు కాలినడక శరణ్యమైంది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రోడ్డులో సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యలు తీర్చాలి.

– వంతాల గురునాయుడు, కమలబంధ గ్రామం, సొవ్వ పంచాయతీ

ప్రభుత్వం స్పందించాలి



గసభ పంచాయతీలో రహదారి సమస్యలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గిరిజన గ్రామాంలో రోడ్డు సౌకర్యానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకొని ఎన్నో రహదారులను నిర్మించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలను గాలికి వదిలేసింది. ఇప్పటికైనా తక్షణమే స్పందించి గ్రామాల్లో మౌలిక సదుపాయాల పనులపై దృష్టి సారించాలి.

– వంతల జెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, గసభ పంచాయతీ

శరవేగంగా పోలీసు స్టేషన్ నిర్మాణ పనులు



నిర్మిస్తున్న నూతన పోలీసు స్టేషన్ భవనం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రసుత్తం 80శాతం పనులు పూర్తయ్యాయి. ఫర్నీచర్, క్యాబిన్లు, వైరింగ్, టైల్స్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడి పాత పోలీసు స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చివేశారు.ఆ స్థలంలోనే నూతన పోలీసు స్టేషన్ నిర్మాణం మొదలు పెట్టారు. సుమారు రూ.2కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో చేపట్టిన భవన పనులు చివరి దశకు చేరాయి. మరో రెండు నెలల్లో అన్ని పనులు పూర్తి చేసి పోలీసు స్టేషన్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పోలీసు స్టేషన్‌కు సరైన భవనం లేక తాత్కాలిక భవనంలోనే ఇబ్బందులు పడుతూ పోలీసు స్టేషన్ నిర్వహణ జరుగుతూ వచ్చింది. వర్ష కాలంలో ప్రస్తుతం ఉన్న పోలీసు స్టేషన్ భవనం కారిపోతూ ఉండడంతో రికార్డులు భద్ర పరించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్వాదీనం చేసుకున్న గంజాయి ఇతరత్రా సరకులను సైతం స్టేషన్‌లో నిల్వ ఉంచేందుకు స్థలం లేదు. వివిధ కేసుల్లో పట్టుకున్న ముద్దయిలను ఉంచేందుకు అవస్థలు పడేవారు. సమస్యల నడుమ పోలీసులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రసుత్తం నిర్మిస్తున్న నూతన భవనం అందుబాటులోకి వస్తే పోలీసు స్టేషన్ నిర్వహణకు అన్ని ఇబ్బందులు తొలగనున్నట్టు పలువురు చెబుతున్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

కొయ్యూరు: మండలంలోని చిట్టింపాడు పంచాయతీ గోపవరం నుంచి లింగాపురం రోడ్డుకు మోక్షం కలగడం ఆనందంగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు అన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ నూకాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. జెడ్పీటీసీ నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ రహదారిని ప్రతిపాదించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా రహదారి మంజూరైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. లింగపురం వరకు రహదారి లేక ఎవరికి అత్యవసరమైనా చాలా అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. త్వరలో వారి కష్టాలు తీరిపోతాయన్నారు. నాయకులు పోతురాజు, గదబపాలెం మాజీ సర్పంచ్ నీలాపు సూరిబాబు, ఉల్లి రామ్మూర్తి, పెట్ల గాంధీ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

పాడేరు రూరల్: పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం తెలుపుతూ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, యునైటెడ్ క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాడేరులోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆయన మృతికి క్రైస్తవ సంఘం నాయకులు తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం క్రైస్తవ సంఘం నాయకులు తిమోతి, జాన్, ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవులపై అక్రమంగా దాడులు జరుగుతున్న ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. క్రైస్తవులపై కొంతమంది కక్షపూరితంగా వ్యవహరిస్తు ఇటువంటి సంఘటనలకు పాల్పడడం భయాందోళనకు గురిచేస్తుందన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండ ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావలని, పాస్టర్ ప్రవీణ్‌పై మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ చర్చిలు, పాస్టర్లపై ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. పాస్టర్ల సంఘాల నాయకులు బాబూరావు, డేవిడ్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులు మంజూరు చేయాలి



జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్న దొరగూడ గిరిజనులు

ముంచంగిపుట్టు: ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు జాబ్‌కార్డులు మంజూరు చేయాలని మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామస్తులు కిల్లో లక్ష్మణ్, కిల్లో పాదలం, కిల్లో లైకోన్‌లు కోరారు. వారు ఆదివారం మండల కేంద్రానికి వచ్చి విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు లేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. దొరగూడలో 20 కుటుంబాలు ఉండగా కేవలం ఏడు కుటుంబాలకే జాబ్‌కార్డులు ఉన్నాయని, మిగిలిన కుటుంబాలకు లేక ఉపాధి పనులు చేయలేకపోతున్నామన్నారు. అనేకమార్లు జాబ్‌కార్డులు మంజూరు చేయాలని ఉపాధి హామీ అధికారులను కోరినా నేటికి మంజూరు చేయలేదన్నారు. ఉపాధి పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే అధికారులు స్పందించి జాబ్‌కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు. గ్రామస్తులు సొంబ్రర, డాలి, అంగ్రి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు విరాళాల సేకరణ



చింతపల్లిలో విరాళాలు సేకరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చింతపల్లి: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఉత్సవాల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ముత్యాలమ్మ జాతర మహోత్సవాలను ఏప్రిల్ 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఏటా ఉగాది రోజు నుంచే విరాళాల సేకరణ ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. ఇదే క్రమంలో ఆదివారం ముత్యాలమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు సమావేశమై ఉత్సక కార్యక్రమాలను చర్చించారు. అనంతరం గ్రామంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దురియా హేమంత కుమార్, పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘం నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, జోగేశ్వరరావు, వీరేంద్రకుమార్, రమేష్, నాగేశ్వరరావు, రమణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా ఉగాది వేడుకలు

- గ్రామాల్లో తెలుగు నూతన సంవత్సర సంబరాలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం



మర్రిగూడెంలోని అమ్మవారి ఆలయం వద్ద భక్తులు

చింతపల్లి: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను ఆదివారం కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున పుణ్య స్నానాలు ఆచరించి, నూతన దుస్తులు ధరించి ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. గోత్ర నామాలతో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందించారు. తెలుగు వారి కొత్త ఏడాదిలో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఆలయాల్లో విశేష పూజలు చేశారు. పంచాంగ పఠనం జరిగింది. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. నూతన వస్త్రాలు ధరించి, దగ్గరలోని ఆలయాలకు వెళ్లి ఇష్టదైవానికి మొక్కులు చెల్లించారు. ఇళ్లన్నీ బంధుమిత్రలతో కళకళలాడాయి. చింతపల్లి ముత్యాల్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్బంగా భజన కార్యక్రమంతో పాటు మహిళలకు ముగ్గులు పోటీలు, కుర్చీలాటలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేశారు. పసుపులేటి వినాయకరావు, వర్తక సంఘ నాయకులు బేతాళుడు, జోగేశ్వరరావు, నాగేశ్వరరావు ,రమేష్ రమణ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో పంచాంగ పఠనంలో గ్రామస్తులు



రాజవొమ్మంగిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా ఊరువాడ ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక షిరిడీసాయిబాబా ఆలయం, కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. రైతులు తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని ఏరువాక సాగారు. నాగళ్లతో పొలాలకు వెళ్లి తొలిదుక్కులు దున్నారు. పంటలు బాగా పండాలని కోరుతూ పూజలుచేశారు.

కూనవరం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని మర్రిగూడెం వద్ద కొలువుదీరిన శ్రీదేవీ ముత్యాలమ్మ అమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. భక్తులు అమ్మవారికి పసుపు కుంకమలు సమర్పించి, నూతన వస్త్రాలు అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. పితృదేవతలక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో తిరునాళ్లు నిర్వహించారు.వివిధ రకాల దుకాణాలు ఏర్పాటుచేశారు. పిల్లల ఆటవస్తువులు, రంగురంగుల బొమ్మలతో సందడిగా మారింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ లతశ్రీ ద్వారా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులను, ఆలయ కమిటీ నిర్వాహకులను ఎస్ఐ లతశ్రీ కొనియాడారు.

గ్రామాల్లో అమ్మవార్ల జాతరలు



బోడకొండమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ పంచాయతీ ఒట్టిగడ్డ గ్రామం వద్ద వేంచేసి ఉన్న ఎర్రమ్మతల్లి జాతర శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాదికి ముందురోజు ఆలయం వద్ద అమ్మవారి జాతర కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామపెద్ద శ్రీకాంత్ దంపతులతో పాటు పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఒట్టిగడ్డ గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: మండలంలోని బందంవారి పాకలులో వేంచేసిన బోడకొండమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవం

కె.కోటపాడు : ఆనందపురం గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, కలశం, త్రిశూలంను ఊరేగించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, మండపారాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు.

సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం జరగనున్నట్టు గ్రామ సర్పంచ్ వంటాకు అప్పాజి తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి కిరీటాల బహూకరణ

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి, అమ్మవార్ల అలంకరణ కోసం గ్రామానికి చెందిన జలమూరు రామమోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు, వారి అల్లుడు తిమ్మాపాత్రుని శ్రీనివాసరావు, ప్రమీలాదేవి(ఆస్ట్రేలియా) కిరీటాలు బహూకరించారు.

ఈ మేరకు దాతలు వాటిని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకోండలరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.